

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## విధి నిర్వహణలో "ఓలేటి నాగేశ్వరరావు" సేవలు

### ఆదర్శప్రాయం : వార్త నాగేశ్వరరావు



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-విద్య :** విధినిర్వహణలో తమ సంస్థ సీనియర్ స్టాఫ్‌రిపోర్టర్ ఓలేటి నాగేశ్వరరావు సేవలు ఆదరప్రాయమని వార్త దినపత్రిక నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ బాలసుబ్రమణ్యం తెలిపారు. ఇటీవల ఆరోగ్యకారణాలతో అకాల మరణం చెందిన కావలి వార్తదినపత్రిక సీనియర్ స్టాఫ్‌రిపోర్టర్,ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు వైకుంఠసమారాధన కార్యక్రమాన్ని గురువారం కావలిలోని దోడ్ల మనోహర్‌రెడ్డి, నారాయణకళ్యాణ మండపంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వార్తదినపత్రిక ఉద్యోగులు, సహచర విలేకరులు, ఆర్సీ ఇన్‌చార్జ్‌లు ఓలేటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యమం మాట్లాడుతు ఇటీవల జర్నలిజంలోకి వచ్చిన యువతకు నాగేశ్వరరావు గురుతుల్యులని, విలువలు కలిగిన జర్నలిజానికి నిలువెత్తు నిదర్శనం నాగేశ్వరరావు అని కోనియాడారు. ఆయన లేని లోటు తమ సంస్థకు తీరనిదని, ఆయన ఆత్మకు శాంతికలగాలని, వారి కుటుంబానికి తమ సంస్థ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్త నెల్లూరు ఆర్సీ ఇన్‌చార్జ్ నరేంద్రబాబు, ఎడిషన్ ఇన్‌చార్జ్ సతీష్, సిబ్బంది ఫణికుమార్, సురేంద్ర, కోవూరు సీనియర్ రిపోర్టర్ పెద్ది సాయిబాబు, మర్రిపాడు సీనియర్ రిపోర్టర్ శ్రీనివాసులు, కలెక్టరేట్ రిపోర్టర్ రిజ్వాన్, సైదాపురం రిపోర్టర్ వేణు, వెంకటాచలం రిపోర్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాని కలిసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లాని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పీకర్ ఓం బిర్లాని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి ఆయనకు శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై స్పీకర్‌తో మాట్లాడారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో వీఆర్సీ పాఠశాల సిద్ధం

- వీఆర్సీ పాఠశాలను ప్రారంభించనున్న నారా లోకేష్
- రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణతో కలిసి పరిశీలించిన కుమార్తె షరిణి
- భారతదేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్‌గా నిలబెట్టడమే లక్ష్యం
- వీఆర్‌సీ పాఠశాలకు 5000 మంది దరఖాస్తులు
- 1050 మందికి నిరుపేదలకు మాత్రమే అవకాశం కల్పించినట్లు వెల్లడించిన మంత్రి
- శరవేగంగా పనులు పూర్తి చేసిన ఎన్సీసీ సిబ్బందిని అభినందించిన మంత్రి నారాయణ
- వీఆర్సీ ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి





**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-వైద్యం** అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతున్నటువంటి వీఆర్సీ పాఠశాలను రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, కుమార్తె షరిణి కలిసి పరిశీలించారు. సర్వాంగ సుందరంగా వీఆర్ హైస్కూల్ ప్రారంభానికి సిద్ధమైంది. క్రీడా మైదానం ఎంతో ఆకర్షియంగా ఉందని, డిజిటల్ విద్యను అందించేందుకు గదులు, ల్యాబ్‌లు, మ్యూజిక్, డాన్స్ రూములో ఏర్పాటు చేశారు. ఈ నేపధ్యంలో పాఠశాలను పరిశీలించిన మంత్రి ముందుగా వీఆర్సీ పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులకు బోధన అంశాలు పిల్లల సంరక్షణపై వారికి దిశా నిర్దేశం చేశారు. వీఆర్సీ ఉపాధ్యాయులు అందరికి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడారు. ఎన్సీసీ సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు వీఆర్సీని అద్భుతంగా తీర్చిదిద్దాలని కొనియాడారు. పనులను శరవేగంగా నిర్వహించినందుకు ఎన్సీసీ సిబ్బందిని మంత్రి అభినందించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమవుతున్నటువంటి వీఆర్సీని విస్తృత ప్రచారం చేసిన మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అడ్మిషన్స్ కోసం 5000 మంది దరఖాస్తు చేసుకున్నారని, అయితే వాటిలో1050 మంది నిరుపేదలైనటువంటి వారికే అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. వీఆర్‌సీ తరహాలోనే సిటీలో మరో పదకొండు హైస్కూల్ పాఠశాలను ఏడాది లోపు సిద్ధం చేస్తామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో మిగిలిన స్కూల్స్‌ని కూడా ఆధునికరిస్తామని, భారతదేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్‌గా నిలబెట్టడమే లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి ఘంటాపథంగా తెలిపారు. ఈ అవకాశం కల్పించినటువంటి సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు క్లాస్‌లు ప్రారంభిస్తామని , బుధవారం ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు క్లాసులు ప్రారంభమవుతాయని, అదే విధంగా గురువారం రోజు నర్సరీ తరగతులు నిర్వహిస్తామని, ఆరో తేదీ విద్యాశాఖ మంత్రి హైస్కూల్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కార్పొరేషన్ కమీషనర్ నందన్, వీఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ వెంకటరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మం గుప్తా, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, 45వ డివిజన్ కో క్లస్టర్ డాక్టర్ పోకల రవి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాండి

- జాయింట్ కలెక్టర్ కే కార్తీక్





**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 26, ప్రభాతవార్త** యువతీ యువకుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తూ, సమాజాన్ని కలుషితం చేస్తున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రతిఒక్కరూ బాధ్యతతో కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ తెలిపారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుండి కస్తూర్బా కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. దాదాపు 600 మందికి పైగా వివిధ కళాశాలల విద్యార్థిని విద్యార్థులు జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్, జెసి కార్తీక్, ఇతర అధికారులుతో కలసి మాదకద్రవ్యాలు వద్దు ఉజ్వల భవిష్యత్తు ముద్దు వంటి నినాదాలతో కదం తొక్కారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సభ నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, అందులో భాగంగా ఈగల్ టీములను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే కళాశాలలో సైతం ఈగల్ క్లబ్ లను ఏర్పాటు చేయటానికి అధ్యాపకులు కృషి చేయాలన్నారు. సమాజంలో మాదకద్రవ్యాలను అరికట్టడానికి అవగాహన , నివారణ, చికిత్స ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. మాదకద్రవ్యాలను కలిగిఉన్నా, ఉత్పత్తి చేసినా, అమ్మినా, కొన్నా, రవాణా చేసినా, ఉపయోగించినా, ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నా కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. దీని గురించి యువతీ యువకులకు అవగాహన ముఖ్యమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సమాజం ఏవిధంగా ప్రభావమవుతుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. యువతి యువకుల్లో సరదాగా మొదలై వ్యసనంగా మారి జీవితాన్ని చిదిమేసే వీటి గురించిన సమాచారాన్ని అందించే భాధ్యత అందరిపై ఉందన్నారు.

**మాదకద్రవ్యాల కోసం బంగారు భవిష్యత్తును పణంగా పెట్టకండి : జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్** ఎస్పీ కృష్ణ కాంత్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అనర్థాల గురించి, వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాల గురించి యువతీ యువకులు తెలుసుకోవాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నిరోధించటానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని, వాటి గురించిన సమాచారం అందించటానికి ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటు చేసిందన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. డ్రగ్స్ రహితంగా జిల్లాగా ఉంచడంలో అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కాలేజీ జీవితం మరపురానిదని, యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్తును పాడు చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. యువకులకు కొత్త విషయాలపై ఉత్సుకత సహజమని, కానీ కష్టపడి చదివించే తల్లిదండ్రులు, భవిష్యత్తు గురించి ఆలోచించి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కేవలం తల్లిదండ్రులే కాకుండా, కళాశాలల అధ్యాపకులు సైతం పిల్లల వైఖరిని నిత్యం గమనించాలన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి సౌజన్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు నాయుడు, ఐ సి డి ఎస్ పి డి హేనా సుజన్, ఆర్ ఐ ఓ వరప్రసాద్, డ్రగ్ ఎడిషన్ నిర్వాహకులు రవీంద్ర, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఒక ధృవతారను కోల్పోయింది : ఎమ్మెల్యే



**కావలి రూరల్, జూన్ 26 ప్రభాతవార్త** కావలి ప్రజలకు ఎనలేని సేవలు అందించిన వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, కావలి శ్రీ వాసవి కన్యకాప రమేశ్వరి దేవస్థానం అద్యక్షులు, ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల అకాలమరణం చెందడంతో కావలి ఒక ధృవతారను కోల్పోయిందని కావలి నియోజకవర్గ శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఓలేటి నాగేశ్వరరావు ఉత్తరక్రియలు సందర్భంగా గురువారం కావలి దొడ్లమనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణమండపంనందు ఏర్పాటుచేసిన సంతాపసభలో ఎమ్మెల్యే దగుమాటి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావును కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిసినా కూడా ఆయన పాత్రికేయ వృత్తికే ప్రాధాన్యతను ఇవ్వడం జరిగిందని తెలిపారు. కావలి రాజకీయ నాయకులకు ఒక మంచి సలహాదారుడయ్యి అందరికి సలహాలు, సూచనలు ఇచ్చేవారని తెలిపారు. కావలి పట్టణంలోని దేవాలయాలు ఎండోమెంట్‌లో కలిస్తే తమకు శివాలయం ఛైర్మన్‌ను ఇవ్వాలని కోరడం జరిగిందని తెలియచేశారు. తనను శివుడు వదిలివెళ్లాడని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ టిడిపి లీగల్‌సెల్ అద్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, రాష్ట్రలీగల్‌సెల్ ఉపాద్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు, కావలి మండల ఆర్యవైశ్యసంఘం అద్యక్షులు తటవర్తి రమేష్, సోమశిల ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబునాయుడు, టిడిపి పట్టణ మాజీ అద్యక్షులు అమరా వేదగిరి సుబ్బరాయుడుగుప్తా, టిడిపి నాయకులు తిరివీధి ప్రసాద్, సురే మదన్‌మోహన్‌రెడ్డి, నాగిశెట్టి మాలకొండయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



**విడవలూరు, జూన్ 26, ప్రభాతవార్త:** మండలం రామతీర్థం గ్రామంలో వెలసియున్న కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలో ఆలయ లెక్కింపు ఆలయ నిర్వహణ అధికారి మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొనుటకు కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ అధికారి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని నాలుగు లక్షల 18 వేల ఎనిమిది వందల యాభై మూడు రూపాయలు హుండీలో వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అత్తిరాల సురేష్, పాలకమండలి సభ్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేరుకే ఆర్వో ప్లాంట్.. విద్యార్థులకు ఉపయోగపడితే ఒట్టు

- లక్షలాది రూపాయలు వెచ్చించినా నిరుపయోగమే..
- కోవూరు మండలంలో ఇదీ సంగతి





**కోవూరు, జూన్ 26 ప్రభాతవార్త :** గత ప్రభుత్వంలో సర్కార్ బడుల యొక్క రూపురేఖలను పూర్తి స్థాయిలో మార్చి వేస్తామని నేతలు ప్రకటించినా ఆచరణలోకి వచ్చే సరికే పలు ప్రాంతాల్లో కనీసం పిల్లల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేసిన మూడు నాళ్లకే మరమ్మతులకు గురయ్యాయి. ఫలితంగా లక్షలాది రూపాయలు వెచ్చించినా అవి నేటికీ విద్యార్థులకు ఉపయోగపడలేకున్నాయి. పాఠశాల పున: ప్రారంభం అయ్యే లోగా వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకురావాలనుకు న్నా.. మరమ్మతులు చేసేందుకు సంబంధిత ఇంజనీర్లు సక్రమంగా ముందుకు రాకపోవడంతో కోవూరు మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ వాటర్ ప్లాంట్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు నేడు పనుల్లో భాగంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాస్తవంగా వీటి మరమ్మతులు సంబంధిత కాంట్రాక్టర్ బాగు చేయించాల్సి ఉంది. ఉపాధ్యాయులు ఈ ఆర్వో ప్లాంట్‌కు సంబంధించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తే వెంటనే వచ్చి బాగు చేస్తారని అప్పట్లో ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్లు ఉపాధ్యాయులకు తెలియజేశారు.

**మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదు**

వాస్తవంగా నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్లలో నాణ్యతా ప్రమాణాల విషయంలో సంబంధిత విద్యాశాఖ అప్పట్లో ఆశించిన మేర చొరవ చూపకపోవడంతో ఏర్పాటు చేసిన మూన్నాళ్లకే అవి మరమ్మతులకు గురయ్యాయి. ఉపాధ్యాయులు వెంటనే యాప్‌లో నమోదు చేస్తే అప్పట్లో ఈ పనులు పొందిన కాంట్రాక్టర్ వచ్చి మరమ్మతులు చేసినా మరలా కొద్ది రోజులకే అవి మరమ్మతులకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులే డబ్బులు వేసుకుని బాగు చేయిస్తున్నా అవి తరచుగా మరమ్మతులకు గురి కావడంతో వారు కూడా మిన్నకుండి పోయారు. ఫలితంగా కోవూరు మండలంలోని ఇనమడుగు, లేగుంటపాడు, కోవూరు, తదితర ప్రాంతాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్లు విద్యార్థులకు సురక్షిత నీరు ఇవ్వక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ఈ మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంట్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. లేని పక్షంలో మధ్యాహ్నం టైంలో విద్యార్థులు ఇంటి నుంచి మంచినీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడింది. కోవూరు మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురై పనిచేయని విషయమై మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మను ప్రభాతవార్త వివరణ కోరగా.. ఇప్పటికే దీనికి సంబంధించి యాప్‌లో నమోదు చేసి సంబంధిత కాంట్రాక్టర్‌కు సమాచారం కూడా ఇచ్చామని, ఇంతవరకు వారు ఎటువంటి స్పందన లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## భూసేకరణ పనులను వేగవంతం చేయండి



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 26, ప్రభాతవార్త** జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన భూములు కేటాయింపు పై సరి అయిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని అధికారులతో ల్యాండ్ ఎక్విజేషన్ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రైల్ ఓవర్ బ్రిడ్జిలకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. నడికుడి శ్రీకాళహస్తి, బుచ్చిరెడ్డిపాలెం దగదర్తి రోడ్డు, గెలకపాడు వీరాయపాలెం వాటర్ పైపులు లేని సంబంధించి భూసేకరణ ఈ విధంగా విరువూరు గ్రామంలో వాటర్ పైపులులకు సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. రామాయంపట్నం పోర్టు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూమి వివరాలు పై సమీక్షించారు. బద్వేలు నెల్లూరు ఫేజ్ 1, ఫేజ్2 సంబంధించి భూ సేకరణ పనులపై వివరాలు అడిగి తెలుసుకొని పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా కృష్ణపట్నం పోర్టు ఫేజ్ 3, వివిధ అటివి అనుమతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, కందుకూరు సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## సముద్ర ఉత్పత్తులను ఎగుమతులకు ప్రోత్సహించే విధంగా చర్యలు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 26, ప్రభాతవార్త** జిల్లాలో సముద్ర ఉత్పత్తులను (మెరైన్ ఫుడ్స్)ఎగుమతులకు ప్రోత్సహించే విధంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానాల్లో మొత్తం 973 అప్లికేషన్ రాగా 856 దరఖాస్తులను అనుమతించడం జరిగిందన్నారు. లైన్ డిపార్ట్మెంట్లలో సుమారుగా116 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వరమే సకాలంలో తదుపరి మీటింగ్ లోపల ఆమోదం తెలపాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ, కార్మిక శాఖ లీగల్ మెట్రాజి తదిర శాఖలు వారి వద్ద ఉన్న కేసులను సత్వరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ లో పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ పరిశ్రమల యాజమాన్యాలతో కులంకుషంగా చర్చించి పరిశ్రమల సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) నిధులను తగువిధంగా ఉపయోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఆయా కంపెనీలకు అవసరమైన మానవనరులకు అవసరమైన శిక్షణను ఇప్పించే విధంగా, ఆయా కంపెనీలలో ఉపయోగించుకునేలా సి ఎస్ ఆర్ నిధులను ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూసేకరణను సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మారుతి ప్రసాద్ ఏపీఐఐసీ అధికారి శివకుమార్, రెవెన్యూ డివిజన్ అధికారులు, కందుకూరి సబ్ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## వీపీఆర్ వికాస్‌తో యువతకు ప్రోత్సాహం

- యువతకు క్రీడా కిట్లు పంపిణీ



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** సమాజంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వీపీఆర్ వికాస్ కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరు మండల యువతకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికి తీసేందుకు వీపీఆర్ వికాస్ సహకారం అవసరమన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడా రంగంలో తమకున్న ప్రతిభను చాటాలన్నారు. యువత చైతన్యవంతులైతే సమాజంలో మార్పు తప్పక సాధ్యమవుతుందన్నారు. క్రీడల పట్ల మక్కువ చూపితే దేహదారుఢ్యం పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం కూడా ఘనసీయంగా పెరుగుతుందన్నారు. ఉద్యోగాల్లో కూడా క్రీడాకారులకు ప్రత్యేక కోటా ఉంటుందని, దీనిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 30 మంది యువతకు క్రికెట్ కిట్లు, 35 మందికి వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, క్రీడాకారులు, నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ భేటీ

- నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే
- కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని వినతి



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 26, ప్రభాతవార్త** కోవూరు నియోజకవర్గ సమస్యలే పరిష్కారంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గురువారం కలెక్టరేట్‌కు వెళ్లిన ఆమె ఈ సందర్భంగా వివిధ అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికుల బకాయిలు చెల్లింపు పై కలెక్టర్ గారితో చర్చించారు. కోవూరు నియోజకవర్గంలోని వివిధ పెండింగ్ సమస్యలను ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలను ఆమె కలెక్టర్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఛైర్మెన్ జట్టి రాజగోపాల్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ రఫీకి నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే



**దగదర్తి, జూన్ 26, ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గురువారం దగదర్తి మండలం యలమంచిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, దగదర్తి మండలం ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షులు, ఎంఎస్ఆర్ టీవీ రిపోర్టర్ మహమ్మద్ రఫీ భౌతిక ఖాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మహమ్మద్ రఫీ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.

## మత్తు పదార్థాలతో జీవితం అంధకారం



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త :** మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని డ్రగ్స్ గంజాయి వంటి వాటికి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశ్రాంత డీఎంఅండ్‌హెచ్ఓ కే.మాశిలామణి పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరిం చుకుని స్తానిక వైద్యశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత బాధ కలిగినప్పుడు మత్తు పదార్థాలకు అలవాటు పడి దానిని వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలని ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు జీవితాన్నినాశనం చేసుకోవద్దన్నారు. ప్రభుత్వాలు మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత ప్రాంతం రాష్ట్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నాయన్నారు. విద్యా సంస్థల అధ్యాపకులు సమాజ హితులు గ్రామాల నాయకులు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాల్సి న బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మాదక ద్రవ్యాలకు మత్తు పదార్థాలకు బానిసలు అయితే ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతాయని కనుక హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని సమాజాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ ల్యాబ్ అధినేత సురేషన, వెంకటేష్, డాక్టర్ ప్రశాంత్, పీఆర్ఓ పెప్సి బా, మల్లిఖార్జున, కీర్తన, శాలిని, దీన శాంతి, విజయ్, సుజిత్ తదితరులు ఉన్నారు.

## ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త :** వింజమూరులోని పాతూరు ప్రభుత్వ పాఠశాల బీసీ కాలనీ కొత్తూరు పాఠశాలల్లో గురువారం ఫ్లోరోసిస్ పై అవగాహన కార్యక్రమాన్ని డాక్టర్ సీహెచ్ దివ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వ్యాధులపై వచ్చే సమస్యలపై విద్యార్థుల పంటి సమస్యలను అద్దం చూసుకొని వాటి నివారణ మరియు నిర్మూలనపై వారికి అర్థమయ్యే విధంగా వివరించారు. వైద్య పరంగా సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం 180 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులలో దాదాపు అత్యధిక మంది విద్యార్థులకు ఫ్లోరోసిస్ అధికంగా ఉన్నట్లు గమనించారు. వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాకలికొండ సీహెచ్ఓ సక్కుబాయి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి, వెంకట సుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జే.వెంకటేశ్వరరావు, పి.కొండారెడ్డి, షఫీ అహ్మద్ వెంకటేశ్వర్లు, చంద్రన్, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

## పెద్ద ఎత్తున యుటిఎఫ్ సభ్యత్వ సమోదు



**వరికుంటపాడు, జూన్26, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ సమస్యలకోసం నిరంతరం పోరాటాలు చేసే యుటిఎఫ్ ఉపాధ్యాయసంఘ సభ్యత్వ నమోదు గురువారం మండల అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు ఎల్‌వి నారా యణ, బివి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. మండలంలోని అన్ని ప్రాదమిక,ప్రాదమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులను కలసి యుటిఎఫ్ సభ్య త్వం అందజేశారు.ఎక్కువ శాతం ఉపాధ్యాయులు యుటిఎఫ్ సభ్యులుగ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారని ప్రధానకార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు .ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు ఆర్ నాగా ర్జున, హరిశ్చంద్రప్రసాద్,ఎస్‌కె కరిముల్ల,జి హజరత్,మండల కార్యవర్గసభ్యులు డి మనోహర్,బి వెంకటేశ్వర్లు,జివి సత్యన్నారాయణ,కె గాంది,అబ్దుల్‌రవూఫ్,ఎల్‌వి చలపతి,ఇ రాజేంద్ర,పి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## దిన కర్మలకు హాజరైన మాజీ యంఎల్‌ఏలు.



**కలిగిరి, జూన్26, ప్రభాతవార్త;** ఉదయగిరి మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు కలిగిరిలోగురువారం జరిగిన దిన కమ్మలకు హాజరైనారు. కలిగిరి మండలం శిద్దనకొండూరు లో గంగినేని అన్నపూర్ణమ్మ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలిగిరిలోని మండల పార్టీ అధ్యక్షులు బిజ్జం క్రిష్ణారెడ్డి అత్తగారైన మునగాలయానాదమ్మ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసన సబ్యులుఅక్కడ పలువురితో కలిశారు. అనంతరం క్రిష్ణారెడ్డి కుటుంబసబ్యులఎను పలకరించి , కుటుంబసబ్యులను పరామరిశారు.

## శాసన మండల సభ్యులను కలిసిన వీరి చలపతిరావు



**కొడవలూరు, జూన్ 26, ప్రభాతవార్త:** వైసిపి శాసనమండలి సభ్యులు సమన్వయకర్త పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా నెల్లూరు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు గురువారం నెల్లూరు నగరంలో వారి నివాసంలో మర్యాదపరంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఆయురారోగ్యాలతో దేవుని ఆశీస్సులతో మరెన్నో వేడుకలు జరుపుకోవాలని కోరారు.

### మారక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం; యువతకు సిఐ వెంకటనారాయణ పిలుపు



**కలిగిరి, జూన్26, ప్రభాతవార్త;** యువత తలచుకుంటే సాదించని ఏదిలేదని కలిగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకట నారాయణ తెలిపారు. గురువారం కలిగిరి పోలీస్ ఆద్వర్యంలో మారక ద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోవ్సవంలో బాగంగా ర్యాలీ నిర్వహించి అనంతరం మానవ హారంచేశారు. కలిగిరి సర్కిల్ ఇనస్పెక్టర్ వెంకట నారాయణ ఆద్వర్యంలో ఈర్యాలీ కార్యక్రమం కలిగిరి మండల తాసిల్దారు కార్యాలయం నుండి కలిగిరమ్మ గుడి సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడే మానవహారం చేశారు. ఈసందర్బంగా సిఐ మాట్లాడుతూ ఈనాడు మన దేశంలో మారక ద్రవ్యాలు, మరియూ అక్రమ రవాణా అనేది ప్రభుత్వానికి , పోలీసులకు ఒక తలనొప్పిగా మారిందన్నారు. దీన్ని అరికట్టేందుకు పోలీసులతోపాటు భావి భారత పౌరులుగా యువతకూడా నడుంబిగించాలన్నారు. అంతేగాక ఈ మారక ద్రవ్యాల మహ్మారికి యువత దూరంగా ఉండాలని ఇతరులకు ఆదర్శంగానిలిచి ఈ మారక ద్రవ్యాల, అక్రమ రవాణామహమ్మారిని దేశం దాటించాని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యస్ఐ ఉమాశంకర్, కలిగిరి ప్రొబిషనల్ సిఐ, పోలీస్ శిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆధార్ క్యాంపును పరిశీలించిన నెల్లూరు ఆర్డీఓ అనూష



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 26, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న బీవీ నగర్ ప్రాంతంలో గల కొన్నేళ్లుగా మదర్ థెరిసా హోమ్ ఏ ఆధారం లేని మహిళలకు ఆశ్రయం కల్పిస్తోంది. వారి ఆలనా పాలనా చూస్తోంది. ఈ చారిటీస్‌లో ఉన్న వృద్ధులైన మహిళలకు ఆధార్ కార్డులు లేకపోవడంతో వారి కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపును ఏర్పాటు చేశారు. 47 మందికి ఆధార్ కార్డు సౌకర్యం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్యాంపును నెల్లూరు ఆర్డీఓ ఎన్ఎస్ అనూష గురువారం పరిశీలించారు. వారి ఆలనా పాలనా చూస్తున్న మదర్ థెరిసా హోమ్ నిర్వాహకులను అభినందించారు. వారికి అందుతున్న సేవలు గురించి తెలుసుకున్నారు.

## గుండెపోటుతో మరణించిన జనసేన కార్యకర్తకి ఆర్థిక సహాయం

**మనుబోలు జూన్ 26 ప్రభాతవార్త :**మనుబోలులోని అరుంధతీ వాడకు చెందిన జనసేన కార్యకర్త బోధనపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అతనికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.. అతని కుటుంబ పరిస్థితులను తెలుసుకొని తమ కార్యకర్త కుటుంబానికి అండగా మేమున్నాం అంటు మనుబోలు జనసేన నాయకులు ఆకుటుంబానికి పది వేల రూపాయాలు ఆర్థిక సహాయాన్ని అందించారు. మరే అవసరం వచ్చిన పార్టీ అండగా ఉంటుందని ఆకుటుంబానికి బరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో జనసేన మండలాద్యక్షులు ప్రసాద్,నీటి తీరువా మెంబర్ మహేష్, జాకీర్,ఖాదర్‌వలీ,ఉదయ్, తదితరులున్నారు.

## మొక్కుబడిగ మండల సర్వసభ్య సమావేశం



**జలదంకి, జూన్26, ప్రభాతవార్త:**జలదంకి మండల సర్వసభ్యసమావేశం గురువారం మొక్కుబడిగ జరిగింది.స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశపు హాలులో మండలాద్యక్షుడు గోచిపాతల వెంకటరమణయ్య అద్యక్షతన సమావేశం నిర్వహించారు .అజండా లోని అంశాలపై చర్చ అన్నారేకాని అలా,అలా చదువుకుంటు పోయారని హాజరైన పలువురు సభ్యులు పెదవివిరవడం కనిపించింది.అదికారులు ఆయా శాఖలకు సంబ ఒదించిన అభివృద్ది, చేపట్టబోయే పనులుగూర్చి వివరించడంతప్ప ఇదేమని ప్రశ్నించిన వారు లేకపోవడం వెలితిగ కనిపించింది.ఒకరిద్దరు వేలెత్తి చూపాలని ప్రయత్నించినప్పటికి దాటవేత దోరణితో ముందుకు పోనిచ్చారు.ఎంపిడిఓ బ్రహ్మయ్య అన్నీతానై యాంకరింగ్‌ను తలపించేల వ్యవహరించిన తీరు ఆక్షేపణగ మారింది.ఇక సభ్యులు ఆశీనులయ్యేందుకు కనీసం కుర్చీలుకూడ వెతుక్కోవలసి వచ్చి తంటాలు పడడం విమర్శలకు తావిచ్చింది.ముఖ్యంగ సభ్యులు కానివారు హాజరై సమస్యలపై గళం విప్పడం విడ్డూరమని ఇది మంచిపద్దతి కాదని మరి అదికారులు ఎందుకు మౌనం వహించారో అర్దంకావడంలేదని గుసగుసలు వినిపించాయి.కొందరు అదికారపార్టి నాయకులు తమకు సమావేశపు సమాచారం ఇవ్వక నిర్లక్ష్యం చేశారని నిలదీయడం మరింత ఆక్షేపణగ కనిపించింది. పలువురు అదికారులు తమ శాఖలకు సంబందిచిన వివరాలు తెలియజేస్తుంటే ఓపంచాయతి కార్యదర్శి అడ్డుతగలడం,అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తీవ్ర చర్చనియాంశమైంది.వారించాల్సి న ఎంపిడిఓ ఎందుకనో లైట్ తీసుకోవడం ఏంటోనని పలువురు ఆక్షేపించారు.మొత్తంమీద మండల సర్వసభ్య సమావేశం ఎందుకనో రానురాను వన్నెతగ్గి వచ్చామా,పోయామా అన్న రీతిలో సాగుతుందని ఆరహస్యం అదికారులకే ఎరుకని సభ్యులు చర్చించుకుంటు వెళ్ళిపోవడం ఇక్కడ కొసమె రుపు. ఈకార్యక్రమంలో,ఎంపిటిసిలు,సర్పంచులు,పలు శాఖల అదికారులు తదితరలు హాజరైనారు.

## వైభవంగా అన్నదానం



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి గురువారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసరి హిమవతి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వలన మనిషి జీవితం చిన్నాభిన్నం

**– డియస్పీ వేణుగోపాల్**



**ఆత్మకూరు, జూన్26, ప్రభాతవార్త:**అంతర్జాతీయ మాదకద్రవ్యాలు, అక్రమరవాణా నివారణా దినోత్సవం సందర్భంగా గురువారం ఆత్మకూరు పట్టణంలో ఆత్మకూరు డియస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో రా ్యలీ నిర్వహించారు. ఈర్యాలీ పోలీస్‌స్టేషన్ నుండి మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌వరకు మత్తు పదార్థాలను వీడండి –జీవితాలను సరిదిద్దుకోండి అంటూ నినాదాలు చేస్తూ సాగింది.ఈసందర్భంగా డియస్పీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన మనిషి జీవితం చిన్నా భిన్నం అవుతుందని, ఎక్కువ యువత ఈ మత్తుపదార్థాలకు అలవాటు పడుతున్నారన్నారు. యువత మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలగురించి తెలుసుకొని దాన్ని విడనాడాలని, తమ బంగారు భవితకు బాటలు వేయాలన్నారు. అనంతరం మానవహారం నిర్వహజంచి ప్రతిజ్ఞ చేశారు.ఈకార్యక్రమంలో సిఐ గంగాధర్, ఎఎస్‌పేట, చేజర్ల ఎస్ఐలు, ఎక్సైజ్ శాఖ సిఐ , ఆత్మకూరు అర్బన్ వైద్యశాల వైద్యాధికారి అస్మా, టిడిపి పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, యువనేత పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కౌన్సిలర్ వేణు, స్వచ్ఛందసంస్థల ఎన్‌జిఓ వాగాల శ్రీహరి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశవర్కర్లు, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలకు క్రమశిక్షణ నేర్పించండి : డిప్యూటీ డీఈఓ



**తోటపల్లిగూడూరు, జూన్ 26, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయతీలో ఉన్న చనపల్లిపాలెంలోని జిల్లా పరిషత్ పాఠశాలను డిప్యూటీ డీఈఓ ఎస్‌వీ నాయక్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో తిరిగి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం గట్టిగా అమలు చేయాలని, అలాగే విద్యార్థులకు మంచి క్రమశిక్షణ విద్యాబుద్ధులు నేర్పించే దాంట్లో ఉపాధ్యాయులు చర్యలు తీసుకుని పిల్లలను మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పిల్లలకు మంచి భోజనం వసతి కల్పించేందుకు కృషి చేస్తుందని , మధ్యాహ్న భోజనంలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారమే భోజనం అందించే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



**కలువాయి జూన్ 26 ప్రభాతవార్త :** సమాజంలో ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా యువత , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలువాయి ఎస్ఐ ఎస్.కోటయ్య తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహి ంచారు.అనంతరం బస్టాండ్ కూడలి నందు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ కోటయ్య ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా కోటయ్య మాట్లాడుతు పై అధికారుల ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం నిర్వహణలో భాగంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు.ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు అవగాహన పెంచుకొని తద్వారా సమాజం పట్ల అంకిత బావంతో వ్యవహరించాలని అన్నారు. యువత , మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఈ సందర్బంగా పలు సూచనలను ఆయన తెలియజేశారు.ఈకార్యక్రమంలో బివిఎస్ఆర్ జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది. పాల్గొన్నారు.

## తహసిల్దారును సన్మానించిన జనసేన నాయకులు



**మనుబోలు జూన్ 26 ప్రభాతవార్త :** మనుబోలు నూతన తహసిల్దారుగా బాధ్యతలు చేపట్టిన ఈగ రమాదేవిని అదే విధంగా డిప్యూటి తహసిల్దారు ప్రదీప్,ఆర్ఐ అరుణ్ తేజాలను గురువారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి జనసేన నాయకులు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో మనుబోలు జనసేన నాయకులు సర్వేపల్లి నియోజకవర్గం సమన్వ యకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు, జనసేన మండల అద్య క్షుడు ప్రసాద్, జాకిరీ ఖాదర్ వల్లి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## యువతా మేలుకో అంటు ర్యాలీ,మానవహారం



**మనుబోలు జూన్ 26 ప్రభాతవార్త :** మనుబోలులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిన పొదలకూరు సర్కిల్ ఇనస్పెక్టర్ శివరామ కృష్ణారెడ్డి ముందుగా విద్యార్థిని విద్యార్థుల చేత పాఠశాల నుండి స్థానిక పుర వీధులలో యువత మేలుకో డ్రగ్స్ వదులుకో అంటు నినాదాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజశేఖర్‌రెడ్డి కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు అంటు నినాదాలు చేసి అనంతరం విద్యార్థిని విద్యార్థులు మరియు పాఠశాల యాజమాన్యం మరియు పోలీసులు సిబ్బంది చేత మాదక ద్రవ్యాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటు ప్రతిజ్ఞ చేయించారు. సిఐ శివరామ కృష్ణారెడ్డి మాట్లాడుతు యువతే రేపటి దేశ భవిష్యత్తు అని అలాంటి యువత మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదని వాటి వలన కలిగే నష్టాలను వివరించారు. ఈకార్యక్రమంలో స్కూల్ విద్యాకమీటి చైర్మన్ బండి కట్టి రవి, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో మూతపడుతున్న హాస్టళ్లు



**ఉదయగిరి, జూన్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని పేద విద్యార్థులు చదువు కోసం ప్రతి రోజు దూర ప్రాంతాల నుంచి రాలేకపోవడంతో వారి కోసం ప్రభుత్వం హాస్టళ్లను ఏర్పాటు చేసింది. హాస్టల్లో విద్యార్థులు లేకపోవడంతో అవన్నీ మూతపడుతున్నాయి. ఉదయగిరిలో మూడుహాస్టళ్ల ఉండగా అన్ని మూతపడ్డాయి. అలాగే దుత్తలూరు బీసీ హాస్టల్, వరికుంటపాడు బీసీ హాస్టల్ సైతం మూతపడ్డాయి. దీంతో ప్రస్తుతం వాటిలో ఉన్న విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని మరలా హాస్టళ్లను పునరుద్దరించాలని ప్రజలు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**లింగసముద్రం, జూన్ 26, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు గొర్రెలు, మేకలు యజమానులు అప్రమత్తంగా ఉండాలని వలేటివారిపాలెం డాక్టర్ ఈ.చెన్నకేశవులు చెప్పారు. గురువారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని మండల పశువైద్యశాలలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధులు వచ్చినప్పుడు వెంటనే వాటిని గుర్తించి తగిన చికిత్స అందించినప్పుడే నివారణ జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో గొర్రెలు, మేకలు అదే విధంగా పశువులు కూడా ఎక్కువగా ఉన్నందున వెంటనే వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నాణ్యమైన మందులతో పాటు, పశువుల దాణాన్ని కూడా సబ్సిడీ ద్వారా అందిస్తుందన్నారు. తాను కూడా లింగసముద్రం వలేటివారిపాలెం పశు వైద్యులుగా పని చేయడం జరిగిందని, మీ అందరికి అందుబాటులో ఉంటానన్నారు. ఎప్పుడైనా ఏ సమయంలోనైనా ఫోన్ ద్వారా తనను సంప్రదించవచ్చని తెలియజేశారు. అదే విధంగా వీఆర్ కోట, లింగసముద్రం పశువైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు బదిలీపై వెళ్లడంతో వైద్యులు లేరని చెప్పారు. వచ్చే నెల 10 దాకా జరుగుతున్న నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం పశుపోషకులకు దాణా అందజేశారు. అదే విధంగా గొర్రెలకు మందును పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు పూరిమిట్ల గురునాథం, గాలికి ప్రసాద్, పశు వైద్య సిబ్బంది చౌదయ్య, వినోద్ కుమార్, పశుపోషకులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఘన సన్మానం



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 26, ప్రభాతవార్త :** నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వీడ్కోలు పలికారు. వారిని ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పశుసంవర్ధకశాఖ డీడీ సోమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖ పోలి క్లినిక్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న సిబ్బంది అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. బదిలీపై వెళ్తున్న లైవ్‌స్టాక్ సహాయకులు వెంకటేశ్వర్లు, అలాగే ఆఫీస్ సబార్డినేట్ అభిలాష్, ప్రశాంత్‌సింగ్‌లను ఘనంగా సన్మానించారు. మీరంతా ఎక్కడికి వెళ్లినా కష్టపడి పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని డిప్యూటీ డైరక్టర్ సోమయ్య వారికి సూచించారు. అలాగే వారి స్థానంలో పని చేసేందుకు నెల్లూరుకు బదిలీపై వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎం.మాలకొండయ్య, డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ టి.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో నిషా ముక్తభారత్



**ఉదయగిరి, జూన్ 26, ప్రభాతవార్త :** స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిషా ముక్తభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, మిని మారథాన్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవించడం వలన వ్యక్తిగతంగా సామాజికంగా నష్టం కలుగుతుందని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిస అయినవారు చట్టపరమైన శిక్షలు కూడా అనుభవించక తప్పదని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఘనంగా సన్మాన కార్యక్రమం



**ఉదయగిరి, జూన్ 26, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు పదోన్నతిపై నెల్లూరు సీఎస్ఓ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ కు బదిలీపై వెళ్తుండటంతో ఉదయగిరి ఆర్టీసీ డిపోలోని సిబ్బంది శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎంగా బాధ్యతలు చేపట్టిన మూడేళ్లలో కార్మికుల పట్ల తీసుకున్న జాగ్రత్తలు అలాగే డిపో అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆత్మకూరు డీఎం శివ కేశవ్ యాదవ్‌ను ఉదయగిరి డిపో ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఆర్టీసీ డిపో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సంగంలో అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేఖ దినోత్సవం




**సంగం జూన్ 26 ప్రభాతవార్త :** సమాజంలో ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా యువత , మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సంగం ఎస్ఐ రాజేష్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్బంగా గురువారం సంగం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం బస్టాండ్ కూడలి నందు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతు పై అధికారుల ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం నిర్వహణలో భాగంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు.ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు అవగాహన పెంచుకొని తద్వారా సమాజం పట్ల అంకిత బావంతో వ్యవహారించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పోలీసులు పాల్గొన్నారు.

## బుచ్చిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం




**బుచ్చి జూన్ 26 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో ప్రపంచ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సిఐ శ్రీనివాసు లురెడ్డి, ఎస్ఐ సంతో ష్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. డ్రగ్స్ వద్దు, స్కిల్స్ ముద్దు అంటు నినాదాలు చేశారు..ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు అవగాహన పెంచుకొని తద్వారా సమాజం పట్ల అంకిత బావంతో వ్యవహరించాలని అన్నారు.యువత , మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఈ సందర్బంగా పలు సూచనలను ఆయన తెలియజేశారు . మత్తు పదార్థాలకు బానిసలై అసాంఘిక కార్యక్రమాలకు పాలుపడితే యువత భవిష్యత్తు నాశనమై పోతుందని సిఐ హెచ్చరించారు.ఈకార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మారకద్రవ్యాల నిర్మూలనే జనసేన లక్ష్యం



**నెల్లూరు,జూన్26 ప్రభాతవార్తవిద్య :** సామాజంలో మారకద్రవ్యాల నిర్మూలను చేపట్టి డ్రగ్స్ రహిత సమాజస్థాపనే తమ పార్టీ లక్ష్యమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తెలిపారు. గత 7రోజులుగా కార్పోరేషన్ పరిధిలో చాయ్‌విత్ జనసైనిక్ ్స కార్యక్రామన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని స్థానిక 9వ డివిజన్‌లో చాయ్‌విత్ జనసైనిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ సూచనలతో తాము ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజల్లో అవగాహన తోనే డ్రగ్స్ రహిత సమాజాన్ని స్థాపించగలుగుతామన్నారు. యువత డ్రగ్స్ తీసుకోకూడదని, అలాగే ఎవ్వరు తీసుకుంటున్నా ఉపేక్షించరాదన్నారు. నేర రహిత సమాజంకోసం ఇటువంటివి చేపట్టాలన్నారు. మారకద్రవ్యాలను వినియోగించటం ఇటీవల కాలంలో పెరిగిపోయిందని, దీంతోపాటూ నేర ప్రవృత్తికూడా పెరిగిందన్నారు. తల్లిదండ్రులు వారివారి పిల్లల విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. అనంతరం ఫ్లకార్డులు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో జనసేన కోర్‌కమిటి సభ్యులు నూనెమల్లికార్జునయాదవ్, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, రాష్ట్ర నాయకులు సుందరరామిరెడ్డి, మనోజ్‌కేదారి, ప్రశాంత్‌గౌడ్, గుర్రం కిషోర్‌బాబు, వెంకట్ యాదవ్, కృష్ణమెహన్, శ్రీకాంత్, హరి, నందిని తదితరులు పాల్గొన్నారు.

## నేడు సోమిరెడ్డి పౌండేషన్‌చే నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**– టిడిపి టిఎన్‌టియుఈ మండల అధ్యక్షుడు రాగాల శివకృష్ణ**



**ముత్తుకూరు, జూన్ 26, ప్రభాతవార్త :** నిరుద్యోగ యువత కోసం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చొరవతో ఏపిఎస్ఎస్‌డిసి, సోమిరెడ్డి పౌండేషన్‌చే నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి టిఎన్‌టియుఈ మండల అధ్యక్షుడు రాగాల శివకృష్ణ కోరారు. 27వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మోగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30కి పైగా కంపెనీలు, 2000కు పైగా ఉద్యోగ అవకాశాలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ఈ జాబ్ మేళాను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సోమిరెడ్డి పౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరెన్ని వివరాలకు 6304545937, 8074634065 సంప్రదించాలని రాగాల శివకృష్ణ కోరారు.

## ట్రిబుల్ ఐటికి శాంతినికేతన్ విద్యార్థిని



**అనంతసాగరం, జూన్26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థిని కె.మహిత ట్రిబుల్ ఐటిలో సీటు సాధించిందని కరస్పాండెంట్ గోలి ప్రభాకర్ తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ పాపిశెట్టి నర్సింహులు, పాఠశాల యాజమాన్యం కె.మహితను అభినందించారు.

## కావలిని మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదాం




**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త :** కావలిని మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుర్వినియోగం, అక్రమరవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కావలి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నుండి శ్రీ పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ప్రొహిబిషన్స్ అండ్ ఎక్సైజ్, పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేక నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం యాంటీడ్రగ్స్‌పై విద్యార్థులతో ప్రమాణం చేయించడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో కావలి నియోజకవర్గంలో గంజాయివనం పెంచి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సొమ్ముచేసుకున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికాలంలోనే గంజాయిని నిర్మూలించామని తెలిపారు. కావలిని మాదకద్రవ్యాలరహిత కావలిగా నిర్మించుకునేందుకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ సన్ని వంశీకృష్ణ, డిఎస్‌పి పి.శ్రీధర్, కావలి రూరల్ పోలీసుస్టేషన్ సిఐ జి.రాజేశ్వరరావు, ఎక్సైజ్ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త :** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగించడం వలన ఆరోగ్యం క్షీణిస్తుందని లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయ వాది ఇసకల సాయిప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డిలు తెలిపారు. హైకోర్టువారి ఆదేశాల మేరకు కావలి సీనియర్ సివిల్‌జడ్జి ఎ.గీతావాణి సూచనల మేరకు కావలి పాతవూరులోని మున్సిపల్ హైస్కూల్ నందు గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాల విద్యార్థులు కళాశాల స్థాయినుంచి క్రమశిక్షణ కలిగి, శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తమకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. విద్యాహక్కు చట్టాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఎల్‌వి అశోక్, సిహెచ్ హరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్‌బిఐ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రక్తదాన శిబిరం



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త :** స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కావలి మెయిన్ బ్రాంచ్ నందు గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయడం జరిగింది. ఈ శిబిరం నందు బ్యాంకు సిబ్బంది 45 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సిహెచ్ లోకనాథం మాట్లాడారు. ఎస్‌బిఐ 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్నివేల యూనిట్ల రక్తం రెడ్‌క్రాస్‌కు అందచేస్తున్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ కార్యదర్శి కె.శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి సిహెచ్ ప్రసన్న, సభ్యులు బి.జీవన్, సెక్యూరిటి అధికారి రహీమ్‌బాష, కావలి రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ కె.హరినారపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువతలో డ్రగ్స్ వ్యసనాన్ని రూపుమాపేందుకు కృషి చేయండి

## కృష్ణపట్నం పోర్టు సర్కిల్ సిఐ రవి నాయక్



**ముత్తుకూరు, జూన్ 26, ప్రభాతవార్త :** యువతలో డ్రగ్స్ వ్యసనాన్ని రూపుమాపేందుకు కృషి చేయాలని కృష్ణపట్నం సర్కిల్ సిఐ రవి నాయక్ పిలుపునిచ్చారు. గురువారం కృష్ణపట్నం నందు అంతర్జాతీయ మాదకద్రవ్యాలు దినం సందర్భంగా సర్కిల్ సిఐ రవి నాయక్ ఆధ్వర్యంలో ర్యాలీని మత్స్య కళాశాల విద్యా ర్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం డ్రగ్స్‌కు బానిసై వారి జీవితాన్ని చీకటి మయం చేసుకుంటున్నారని అన్నారు. మాదకద్రవ్యాల వ్యసనం వల్ల వ్యక్తిగత జీవితంతో పాటు సమాజ పురోగతి కూడా దెబ్బతింటుందని అన్నారు. అలాగే యువతలో డ్రగ్స్ వ్యసనాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి, కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

## అంకమ్మ తల్లి 14వ వార్షికోత్సవ వేడుకలు



**విడవలూరు, జూన్ 26, ప్రభాతవార్త :** గ్రామ దేవతగా వెలసియున్న శ్రీ అంకమ్మతల్లికి గురువారం 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలు రకాల పండ్లతో అలంకరణ పూజలు చేశారు. ఉదయం నుండి అభిషేకం, కుంకుమర్చిన, సాయంత్రం పూల అలంకరణ, రాత్రి పల్లకి సేవ, కార్యక్రమాలను అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శిం చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉభయగర్తలుగా డాక్టర్లు సాయిబాబా, మస్తానమ్మ, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అర్చకులు కొన్నగిరి పాల్గొన్నారు.

## సిమెంట్ బెంచీలు వితరణ



**బిట్రగుంట జూన్ 26 ప్రభాతవార్త:** బోగోలు మండలం కోవూరుపల్లి గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఇందూపూరు. రామమోహన్ రెడ్డి తన తల్లిదండ్రులు, తన సోదరుడు మాజీ టీడీపీ మండల కన్వీనర్ స్వర్గీయ ఇందూపూరు ధనుంజయరెడ్డి జ్ఞాపకార్థం కోవూరుపల్లి సచివాలయం, బిట్రగుంట రైల్వే ఫుట్ బాల్ గ్రౌండ్ నందు, కప్పరాలతిప్ప కూడలి వద్ద సిమెంట్ బెంచీలు వితరణ గా అందజేశారు. దీంతో దాత దాతృత్వానికి పలువురు అభినందనలు తెలిపారు.

## ఖాదర్‌బాషాకు నివాళులర్పించిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త :** తెలుగుదేశంపార్టీ మైనారిటిసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా(ఇట్టు) ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన సందర్భంగా టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర గురువారం వారి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడారు. కావలి పట్టణంలో తెలుగుదేశంపార్టీ బలోపేతం కోసం ఖాదర్‌బాషా చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. మైనారిటి వర్గాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఖాదర్‌బాష లేనిలోటు పూడ్చలేనిదని, వారి కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, కావలి రూరల్ మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకటరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువుల్లో, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ కార్యక్రమాలు



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 26, ప్రభాతవార్త :** పశువులు, గొర్రెలు, మేకలు మొదలగు పెంపుడు జంతువుల్లో వచ్చే వ్యాధులను ముందుగా గుర్తించి వాటికి సరైన వైద్యం అందించడం ద్వారా అవి ఆరోగ్యంగా జీవించగలుగుతాయని, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. గురువారం రైల్వే ఫీడర్స్ రోడ్డులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో నట్టల నివారణ లక్ష్యంగా పశు ఆరోగ్య శిబిరాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి జులై 10వ తేదీ వరకు జిల్లాలో పశువులు, గొర్రెలు, మేకలు మొదలగు పెంపుడు జంతువుల ఆరోగ్య, వైద్య శిబిరాలు నిర్వహించి నట్టల నివారణకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతే కాకుండా పశువులకు వేసే దాణా రెండవ దఫా జిల్లాకు 169 టన్నులు మంజూరైందని దీన్ని 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తామని తెలిపారు. 50 కేజీల దాణా 1110 కాగా రైతులకు సగం ధరకే లభిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన రైతులు సబ్సిడీ ద్వారా 555 రూపాయలకే 50 కేజీల దాణా పొందవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఓలేటి చిత్రపటానికి నివాళులర్పించిన స్వచ్ఛంద సంస్థల బాధ్యులు



**కావలిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త :** ఆర్యవైశ్య ప్రముఖులు, కావలి వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికే యులు ఓలేటి నాగేశ్వరరావు ఉత్తరక్రియల సందర్భంగా కావలి దొడ్లమనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణమండపంలో గురువారం ఏర్పాటు చేసిన సంతాపసభలో స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్ షేక్.మస్తాన్, రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ఎంవి ప్రసాద్‌రావు, వాయిస్ ఆఫ్ ముస్లిం మైనారిటీ సేవాసంస్థ అధ్యక్షులు మొగల్ సలీంబేగ్, రహీం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అబ్దుల్ అలీంలు పాల్గొని ఓలేటి చిత్రపటానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఓలేటి ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలియచేశారు.

## విచ్చలవిడిగ మాతమ్మ చిందులు

**వరికుంటపాడు, జూన్26, ప్రభాతవార్త:** వరికుంటపాడు మండలంలో ఇటీవల కాలంలో విచ్చలవిడిగ మాతమ్మ చిందులు నిర్వహిస్తున్నట్లు సోషల్‌మీడియాలో వైరల్‌గ మారింది. ఆదివారం మండలంలోని విరువూరు గ్రామంలో మాతమ్మ చిందులు గుట్టుచప్పుడు కాకుండ నిర్వహించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. నాగారపమ్మ కొలుపు సందర్భంగ మాతమ్మ చిందులు వేయించి నిషేదంలో వున్నఆచారాన్ని ప్రేరేపించినట్లు సోషల్‌మీడియా వేదికగ వైరల్‌గ మారిన సంబంధిత అదికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో మరొక గ్రామంలోసైతం మాతమ్మ చిందులు వేయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో మండలంలో మాతమ్మచిందులతోపాటు అనుమతులు లేకుండానే డ్యాన్స్‌బేబి డ్యాన్స్ పేరుతో అశ్లీల నృత్యాలను నిర్వహిస్తున్నారని ఆరోపణలు వున్నాయి. అదికారులు రాజకీయవత్తిళ్ళకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. కావున ఇప్పటికైన వున్నతాదికారులు పోలీసు అదికారులుఈమాతమ్మ చిందులను అరికట్టాలని స్థానికులు కోరుచున్నారు.

## 7న ప్రతి మాదిగ పల్లెలో జెండా ఎగరాలి



**సీతారామపురం జూన్ 26 ప్రభాతవార్త :** జులై 7 వ తేదిన ప్రతి మాదిగపల్లెలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, జెండా ఎగురవేయాలని ఎంఆర్‌పిఎస్ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మందా వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. గురువారం ఎంఆర్‌పిఎస్ జాతీయ అద్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సీతారామపురం మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ మండలాద్యక్షులు కొడవటి కంటి కిరణ్ ఆద్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మందా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పందిటి అంబేద్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాతు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌టి ఏర్పడి జులై 7 నాటికి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి గ్రామంలో మాదిగ బిడ్డ , ఎస్‌సి వర్గీకరణకై జరిగిన పోరాటాన్ని గుర్తు చేసుకోవాలని ఉద్యమానికి మొదటి నుండి తోడ్పాటు అందించిన ఎస్‌సి, ఎస్‌టి , బిసి , మైనార్టీ వర్గాల ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటామని వారి శ్రేయస్సుకు ఎల్లవేళలా ముందుంటామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణతోపాటు సమాజంలో అన్ని వర్గాల ప్రజలకోసం పాటు పడిన చరిత్ర ఎంఆర్‌పిఎస్ ఉద్యమనేత మందికృష్ణ మాదిగకు ఉందని మాదిగలకే కాకుండా వికలాంగులు వృద్ధులు వితంతువుల పెన్షన్ పెంపులో కీలక భూమిక ఎంఆర్‌పిఎస్ ఉద్యమానిదని తెలిపారు. అదే విధంగా జులై 7న ప్రతి మాదిగ పల్లెలో జెండాదిమ్మల నిర్మాణం చేపట్టాలని జులై 7 వ తేదిన ఒక పండుగ వాతావరణంలా మాదిగ పల్లెలలో జెండా ఆవిష్కరణ జరగాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌టి గ్రామ కమీటి ఏర్పాటు చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కె. బాలస్వామి, కె. ఆంటోని ,రవి, బాబు, దేవరాజు, నాగయ్య, నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## కారు దగ్ధం- తప్పిన పెను ప్రమాదం



**మనుబోలు జూన్ 26 ప్రభాతవార్త :** మనుబోలులోని కాగితాల పూరు రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కారు దగ్ధమైన సంఘటన గురువారం నాటు చోటు చేసుకుంది. గూడూరు నుండి నెల్లూరు కి వెళుతున్న కారులో ఆకస్మాత్తుగా పొగలు రావడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు హుటాహుటీన కారులో నుండి బయటకు వచ్చేశారు. అనంతరం కారు పూర్తిగా దగ్ధమైంది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## సీతారామపురం ఏపిఎం శ్రీరామ్.శ్రీనివారావు



**సీతారామపురం జూన్ 26 ప్రబాతవార్త :** డిఆర్‌డిఎ వెలుగు సీతారామపురం మండల శాఖ ఏపిఎంగా శ్రీరామ .శ్రీనివాసరావు గురువారం స్రీశక్తి భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన దుత్తులూరు ఎపిఎంగా పనిచేస్తు బదలీపై సీతారామపురం మండలానికి వచ్చారు. గతంలో సీతారామపురం ఏపిఎం గా పనిచేస్తున్న వైనారూత్ పల్నాడు జిల్లాకు బదలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీనివాసరావు మాట్లాడుతు డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను పారదర్శకంగా అందించడంలో పూర్తి స్థాయిలో నిబ్బదతతో పనిచేస్తానని అదే విధ ంగా డ్వాక్రా మహిళల నుండి ప్రభుత్వానికి రావలసిన మొండి బకాయిల రికవరీలో ప్రత్యేక చొరవ తీసుకొని ఉత్తమ సేవలు అందిస్తానని తెలిపారు.

## రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య



**కావలిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త :** కావలి జిఆర్‌పి పోలీసుస్టేషన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వరపురం కావలి రైల్వేస్టేషన్‌ల మధ్యలో గల ఆర్‌యస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ వెనుకవైపున గురువారం రైలుకిందపడి కావలి రూరల్ మండలం ఒట్టూరు గ్రామానికి చెందిన పొన్నాడి శ్రావణ్‌కుమార్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. కావలి జిఆర్‌పి ఎస్ఐ రమాదేవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియచేశారు.

## మాజీ ఎమ్మెల్యేని కలిసిన రాజు



**కావలిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త :** వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్రకార్యదర్శిగా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పట్టపుపాలెం గ్రామానికి చెందిన కొమారి రాజు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గ వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం కొమారి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలబొకె అందచేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. వైయస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్రకార్యదర్శిగా తనకు అవకాశం కల్పించినందుకు రామిరెడ్డిప్రతాప్‌కుమార్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలియచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ వైయస్‌ఆర్‌సిపి అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు పందిటి కామరాజు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌యాదవ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అతిసార నుండి మీ పిల్లలను రక్షించండి



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త–వైద్యం :** అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి మీ పిల్లలను రక్షించుకోవాలని వెంగళరావు నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పి.రీనా భారతి అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎన్బిటి కాలనీ, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేసన్, దిపిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ పి.రీనా భారతి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అతిసార నివారణ కార్యక్రమంలో భాగంగా జూన్ 16 నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ఓఆర్ఎస్ ప్యాకెట్స్, జింక్ టాబ్లెట్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. అతిసార వచ్చిన బిడ్డకు ఒక రోజులో మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచగా విరోచనాలు అయినట్లయితే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రం, లేదా ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలని అన్నారు. అతిసార వ్యాధిలో ముఖ్యంగా తల్లిపాలు తాగకపోవడం లేదా తక్కువ తాగడం, ప్రతిది వాంతి చేసుకుంటూ ఉండడం, తరచుగా పలుచని విరోచనాల కారణంగా నీరసంగా ఉండడం జరుగుతుందన్నారు. నివారణ కొరకు సబ్బు, నీటితో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఎల్లప్పుడూ మరుగుదొడ్డిని ఉపయోగించడం చేయాలన్నారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే తాగించాలని చెప్పారు. మంచి పౌష్టికాహారం ఇవ్వాలని, రోటా వైరస్, తట్టుకు టీకాలు వేయించుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ కోఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జయలక్ష్మీ, హెల్త్ అసిస్టెంట్ రాజేష్, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ షేక్ రసూల్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పి ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు



**సైదాపురం, జూన్ 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కలిచేడు గ్రామ సమీపంలో కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎస్సై కాంతికుమార్ వివరాల మేరకు మండల పరిధిలోని అనంత మడుగు గ్రామం నుంచి పొదలకూరు మండలంలోని కొనగలూరు గ్రామ సమీపంలో ఉన్న మైనింగ్ కంపెనీకి కూలీ పనుల నిమిత్తం ఆటోలో 8 మంది వెళ్తుండగా కలిచేడు గ్రామ సమీపంలోని మసీదు దగ్గర ఆటో ముందు టైరు పంచర్ అవడంతో అదుపు తప్పి బోల్తా పడిందని, దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయని వెంటనే వారిని పొదలకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని ఆయన అన్నారు.

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా



**వింజమూరు, జూన్ 26, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలోని యువతీ యువకులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం పరుచుకోవాలని అన్నారు. ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 9గంటల నుండి వింజమూరు పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామ సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రధాన ప్రాంతీయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కంపెనీల వారి మేనేజర్లతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన యువకులు హెచ్‌టీటీపీఎస్: //ఎన్ఏఐపీయు ఎన్‌వైఎం.ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్ రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ లింక్ నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ చక్కని సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా నియోజకవర్గంలోని కూటమి నేతలు యువతీ, యువకులకు అవగాహన కల్పించి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. పదో తరగతి పైబడి చదివిన వారందరికి ఉద్యోగ అవకాశాలు కలవు. వయసు 18 నుండి 39 సంవత్సరాలు కలిగిన వారందరికి చక్కని అవకాశం.. కనుక ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలియజేశారు.

## అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శానిటైజర్ వర్కర్స్ నిరసన



**అల్లూరు, జూన్ 26 ప్రభాతవార్త:** అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటైజర్ వర్కర్స్ గురువారం నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని నిరసన వ్యక్తం చేశారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందజేశారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బంది జీతాలు విషయం పై అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ గత నాలుగు నెలల నుండి జీతాలు అందక పోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని జీవనం సాగిస్తున్నామని ఇకనైనా అధికారులు మేము ఎదుర్కొంటున్న బాధలను అర్థం చేసుకొని మాకు జీతాలు వచ్చే విధంగా న్యాయం చేయాలని తెలియజేశారు

## లబ్దిదారులు సహకరించాలి



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రభుత్వం ద్వారా స్థలాలు పొందిన లబ్దిదారులు పూర్తిస్థాయిలో సహకరించి గృహ నిర్మాణాలను మరింత వేగవంతం అయ్యేందుకు సహకరించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సచివాలయ పరిధిలోని హౌసింగ్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని లబ్దిదారులు నిర్మాణాలు మరింత వేగవంతం అయ్యేలా సచివాలయ ఉద్యోగులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల కాలంలో గృహ నిర్మాణాలు చేసుకునే ఎస్సీ, ఎస్టీ , బీసీ లబ్దిదారులకు నిధులు పెంచిన నేపథ్యంలో సంబంధిత లబ్దిదారుల్లో మరింత అవగాహన కల్పించేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తగు చొరవ తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోజూ లబ్దిదారులతో చర్చించి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## జర్నలిజంలో నీతి, నిజాయితీగా సేవలందించిన ఓలేటి



**కావలిరూరల్, జూన్ 26 ప్రభాతవార్త** జర్నలిజంలో నీతి, నిజాయితీగా సేవలందించిన వార్త జాతీయ దిన పత్రిక సీనియర్ పాత్రికే యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, కావలి శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు ఓలేటి నాగేశ్వరరావు అనిటి డిపిజాతీయ ప్రధానకార్యదర్శి,ఎమ్మెల్సీ బీదరవిచంద్ర పేర్కొన్నారు. ఓలేటి నాగేశ్వరరావు ఉత్తరక్రియలు సందర్భంగా గురువారం కావలి కొత్తబజారులోని ఓలేటి స్వగృహానికి బీద రవిచంద్ర విచ్చేసి ఆయన అకాల మరణానికి చింతిస్తూ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావు 40 సంవత్సరాల జర్నలిజంలో నిజాయితీగా, నిర్భయంగా సేవలందించడం జరిగిందన్నారు. ఆయన మృతి అందరిని తీవ్రదిగ్భ్రాంతికి గురిచేసిందని, సమాజపరంగా, నాకు వ్యక్తిగతంగా తీరనిలోటు అని తెలియచేశారు. రాజకీయలలో తొలి నుంచి నాకు అనేక సలహాలు, సూచనలు ఇచ్చేవారని నాపట్ల ప్రత్యేక అభిమానం చూపేవారన్నారు. 2004-09 తర్వాత మరియు 2019-24 వ్యవధిలో నేను, తెలుగుదేశంపార్టీ కష్టాలలో ఉన్నపుడు ఎంతో అండగా ఉండేవారన్నారు. వారితో నాకు భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికి వ్యక్తిగతంగా నాకు ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉండి నా అభివృద్ధిని కాంక్షించేవారని తెలియచేశారు. 2019-24 సంవత్సరకాలంలో కావలిలో జరిగిన అవినీతి, అరాచకాలు వెలికితీసి ప్రజలను చైతన్యపరిచేందుకు జర్నలిస్టుక్లబ్‌ను ఏర్పా టుచేసి ముందుకు సాగారన్నారు. నాడు కావలిలో జరిగిన అరాచకాలు, అన్యాయాలను ఎండగట్టారన్నారు. నాడు కావలి పట్టణంలో జర్నలిస్టులపై కూడా బరితెగించి దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఓలేటి నాగేశ్వరరావు కుటుంబంపై కూడా దాడిచేసినా వారు ఎక్కడా అధైర్యపడక ముందుకు సాగారన్నారు. ఓలేటి నాగేశ్వరరావు కుటుంబానికి అండగా టిడిపి ఉంటుందని, వ్యక్తిగతంగా వారి కుటుంబానికి ఏ సహకారం అవసరమైనా అందించడానికి నేను సిద్ధంఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ కిషోర్‌బాబు, జ్యోతిబాబురావు, రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు అమరావేదగిరి సుబ్బరాయుడుగుప్తా, కావలి టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, టిడిపి నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓలేటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థంగా పేదలకు అన్నదానం



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త** ప్రముఖ పాత్రికేయులు, కావలి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యులు, అన్న కుమారులు ఓలేటి గుప్తా, రవి, స్నేహితులు నేరెళ్ల గురుప్రసాద్, సాయిమనోజ్, కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, వేలూరు జయచంద్రనాయుడు, పచ్చిపులుసు వెంకన్న, కలికి శ్రీహరిరెడ్డి, కలవకూరి సుగుణకుమార్‌రెడ్డిలు సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో కావలి బుడమగుంట గిరిజన కాలనీలోని పేదలందరికి గురువారం అన్నదానం చేయడంతోపాటు ప్లేట్లు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఓలేటి నాగేశ్వరరావు స్నేహితులు మాట్లాడారు. తమతో నాగేశ్వరరావు ఎప్పుడూ సన్నిహితంగా ఉండేవారని, ఆయన కుటుంబసభ్యులుగా మమ్మల్ని భావించేవారని తెలిపారు. ఎప్పుడూ చిరునవ్వుతో పలుకరిస్తూ, అందరిని నవ్విస్తూ, అందరితో ఎంతో ఆప్యాయతతో ఉండేవారని తెలిపారు. ఓలేటినాగేశ్వరరావు అకాలమరణం చెందడం తమకెంతో దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, అలాగే వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూతిని తెలియ చేసున్నామన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వరరావును కోల్పోవడం బాధాకరం



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త** సీనియర్ జర్నలిస్ట్, కావలి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావును కోల్పోవడం చాలా బాధాకరమని వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలియచేశారు. ఓలేటి నాగేశ్వరరావు అకాల మరణానికి చింతిస్తూ వారి ఉత్తరక్రియలు సందర్భంగా కావలి దొడ్లమనోహర్‌రెడ్డి, నారాయణ కళ్యాణమండపం నందు గురువారం ఏర్పాటుచేసిన సంతాపసభలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి, ఘనంగా నివాళర్పించి మాట్లాడారు. ఓలేటి నాగేశ్వరరావు మరణం పత్రికారంగానికి తీరలిలోటు అని ఆయన కావలి పట్టణ ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని తెలిపారు. అనేక సందర్భాల్లో తనకు సలహాలు, సూచనలు ఇస్తుండేవారని తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్.షాహుల్ హమీద్, వైసిపి నాయకులు కుందుర్తి కామయ్య, కుందుర్తి శ్రీనివాసులు, కలవకూరి సుగుణకుమార్‌రెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, కుందుర్తి రాజేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓలేటి మృతి తీరనిలోటు : ఆర్యవైశ్య ప్రముఖులు కందుకూరి



**కావలిరూరల్, జూన్26 ప్రభాతవార్త** వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్య ప్రముఖులు, కావలి వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు ఓలేటి నాగేశ్వరరావు మృతి ఆర్యవైశ్యులకు తీరనిలోటు అని బిజెపి రాష్ట్ర సహకోశాధికారి, కందుకూరి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత కందుకూరి వెంకటక సత్యనారాయణ తెలిపారు. నాగేశ్వరరావు ఉత్తరక్రియల సందర్భంగా కావలి దొడ్లమనోహర్‌రెడ్డి, నారయణ కళ్యాణ మండపం నందు గురువారం ఏర్పాటుచేసిన సంతాపసభలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కందుకూరి మాట్లాడారు. నాగేశ్వరరావు 40 సంవత్సరాలపాటు పత్రికా రంగంలో ఎనలేని సేవలు అందించి ఎంతోమందికి మార్గదర్శిగా నిలిచా రన్నారు. ఆయనలేనిలోటు ఎవరూ తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడుని ప్రార్థిస్తున్నామన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియచేస్తున్నారు.

## కలిగిరమ్మకు 20వేలు విరాళం అందజేసిన బొల్లినేని



**కలిగిరి, జూన్26, ప్రభాతవార్త;** కలిగిరమ్మ తిరుణాళ్లకు మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకట రామారావు రు. 20 వేల రూపాయలు విరాళం అందజేశారు. గురువారం కలిగిరికి వచ్చిన బొల్లినేనిని కలిగిరమ్మ దేవస్థాన కమిటీ కలిసింది. ఈసందర్భంగా అమ్మవారి తిరుణాళ్ల ఆదివారం నుండి జరుగుతున్న దృష్యా తిరుణాళ్లకు రావల్సిందిగా బొల్లినేనిని ఆహ్వానించారు. అనంతరం అమ్మవారికి తిరుణాళ్లకు తప్పక వస్తానని తనవంతుగా అమ్మవారికి రు. 20వేలు విరాళంగా అందజేస్తున్నట్లు బొ5ల్లినేని తెలిపారు. రామారావు మాట్లాడుతూ నమ్ముకున్న బక్తులను నమ్మకంగా కాపాడేతల్లి శ్రీ కలిగిరమ్మ తల్లిఅని అలాంటి తల్లి తిరుణాళ్ల అందరికీ సుభకరమన్నారు. కలిగిరమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతో షాలతో వర్ధిల్లాలని బొల్లినేని ఆకాంక్షిచారు. ఈకార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు టిడిపి నాయ కులు పాల్గొన్నారు.

## వెంకటాచలం నగరవనం అభివృద్ధిపై సమీక్ష



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-వైద్యం** వెంకటాచలం నగరవనం అభివృద్ధిపై అధి కారులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం సమీక్ష నిర్వహిచారు. నెల్లూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరైన డీఎఫ్ఓ మహబూబ్ భాషా, డీటీఓ ఉషశ్రీ నుడా ఇంజనీరింగ్ అధికారులు, తహాశీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు. పర్యాటక శాఖ రూ.9కోట్లు, అటవీశాఖ రూ.2కోట్లు, సీఎస్ఆర్ నిధులు రూ.2 కోట్లు, నుడా రూ.5.20 కోట్లతో పాటు వివిధ పనులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఖర్చు చేయాలని నిర్ణయించారు. నగర వనాన్ని రాష్ట్రంలోనే నెంబర్ 1 గా తీర్చిదిద్దేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామన్న నుడా చైర్మన్ కోటంరెడ్డి. పర్యాటక శాఖ నిధుల కోసం ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీతో ఫోన్‌లో మాట్లాడిన సోమిరెడ్డి. అన్ని శాఖల సహకారంతో నగరవనాన్ని రాష్ట్రంలోనే అద్భుతంగా తీర్చిదిద్దుతామన్న చంద్రమోహన్‌రెడ్డి.

## ఘనంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త** నెల్లూరు నగర నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో వేల మంది కార్యకర్తల మధ్య పండుగలా జరుగుతున్న పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు. వేలది మంది కార్యకర్తల నడుమ చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు విజయోత్సవ సభలా సాగింది. నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా స్థానిక సాయి బాబా మందిరంలో పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిటీ కార్యాలయంలో పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గారు సర్వమత ప్రార్థనల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నడుమ కేక్ కటింగ్ నిర్వహించి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలు బ్లడ్ డొనేషన్ క్యాంపులో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతను ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ అభినందించి వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆశేష జన వాహిని మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. గతంలో రెడ్ క్రాస్ చైర్మన్‌గా, పనిచేసిన, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా సేవలందిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్చార్జిగా పని చేస్తున్న, ఏ పదవిలో ఉన్న బాధ్యతగా పనిచేసి ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులు కార్యకర్తలు, రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు, సేవాకార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసి నెల్లూరు జిల్లాను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అడ్డగా మారుస్తానని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు



**సైదాపురం, జూన్ 26, ప్రభాతవార్త** మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తునునాశనం చేసుకోవద్దని సైదాపురం ఎస్సై కాంతికుమార్ తెలి పారు. అంతర్జాతీయ మాదక ద్ర వ్యాల నివారణ దినోత్సవం సంద ర్భంగా మండల కేంద్రమైన సైదాపురంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కాంతి కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ, సీఐ పర్యవేక్షణలో మాద కద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన నిర్వహించడం జరిగిందని తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి పౌరుని బాధ్యత అని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన తెలిపారు. ముఖ్యంగా నేటి తరం యువత డ్రగ్స్‌కు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకో వద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్రిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-విద్య :** వైకాపా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ముంగమూరు అశ్రిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని స్థానిక ప్రగతి చారిటీస్‌లో వైకాపా నగర నియోజకవర్గ అధ్యక్షులు, తూర్పురాయల సీయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిధిగా కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తన తండ్రి ఓ సాదారణ ఉపాధ్యాయునిగా తన ప్రయానాన్ని సాగించి నేడు విద్యా సంస్థల అధినేతగా, ఎమ్మెల్సీగా ఎదగటం జరిగిందన్నారు. కృష్ణచైతన్య విద్యాసంస్థల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి సేవ చేయటం జరిగిందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్‌గా ఉన్న కాలంలో చేసిన సేవా కార్యక్రమాలు, ప్రజల్లో వస్తున్న ఆదరణతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిని ఆకర్షించి ఆయన ఆదేశాల మేరకు ఎమ్మెల్సీగా పోటీ చేసి విజయపతాం ఎగువేశారన్నారు. వైకాపా జిల్లా అధ్యక్షునిగా ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉన్నారని తెలిపారు. ఆయన పై ఇంత ఆదరణ, ప్రేమ చూపిస్తున్న అందరికి రుణపడి ఉంటామన్నారు. తన తండ్రి పుట్టిన రోజు వేడుకలను నేడు ప్రగతిచారిటీస్‌లోని విద్యార్దుల మధ్య జరుపుకోవటం మిక్కిలి సంతోషంగా ఉందని, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ముం గమూరు అశ్రిత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో అశ్రిత్‌రెడ్డి మరింత అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం అశ్రిత్‌రెడ్డిమాట్లాడుతు తమ పార్టీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని చిన్నారుల మధ్య జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆయన మరింత ఉన్నత పదవులు సాధించి ప్రజలకు సేవ చేయ్యాలని ఆకాంక్షించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి విద్యార్దులకు పంపిణీచేశారు.అ లాగే అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థి సంఘ నాయకులు సింగంశెట్టి అశోక్, సుమదర్, రవిచంద్ర, శరత్, నాని, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి జన్మదిన వేడుకలు




**నెల్లూరు రూరల్, జూన్ 26, ప్రభాతవార్త** నెల్లూరు నగర ఇంచార్జ్ ఎమ్మెల్సీ పదవత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు నెల్లూరు నగం మంతటా సేవా కార్యక్రమాలతో కొన సాగాయి. నెల్లూరు వెంకటేశ్వర 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీ లోని ప్రాథమిక పాఠశాలలో డివిజన్ ఇంచార్జ్ వెంగల్ రెడ్డి పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు రానా ప్రమోద్ రెడ్డి విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించి వారి చేత చంద్రశేఖర్ రెడ్డి జన్మదినం వేడుకలు నిర్వహించారు. 46వ డివిజన్ కార్పొరేటర్ ఏలూరు మహేష్ 40 4వ డివిజన్ కార్పొరేటర్ నీలి రాఘవ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన నీకు పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ లో ఘనంగా చంద్రశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు చారిటీలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి కిషన్ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయంలో 216 టెంకాయలు కొట్టి ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి దినదిన అభివృద్ధి చెందాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు రాజకుమార్ యువసేన ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ లో వందమంది యువత రక్తదానం చేశారు. మద్రాస్ బస్టాండ్ వద్ద వైసీపీ నాయకులు యస్దాని ఆధ్వర్యంలో ద్రాక్ష జ్యూస్ పంపిణీ చేసి చంద్రశేఖర్ రెడ్డి మీద అభిమానంతో ఆయన గురించి ఓ పాట పాడించి ఆసీడిని చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

## 28 నుండి అమ్మఫర్నీచర్‌మాల్ ఇంటర్నేషనల్ ఫర్నీచర్‌ఎక్స్‌పో



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త- విద్య :** తమ సంస్థ ఆధ్వర్యంలో 28 నుండి నగరంలోని స్థానిక మినిబై పాస్‌లోని జిపిఆర్ కళ్యాణ మం డపంలో ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పో2025ను నిర్వహిం చనున్నామని అమ్మ ఫర్నీచర్‌మాల్ అధినేత గడ్డం సుజన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని స్థానిక మినిబైపాస్‌రోడ్డులోని అమ్మ ఫర్నిచర్‌మాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతఉ ఈనెల 28నుండి జులై 2 వరకు ఇంటర్నేషనల్ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో అన్నీరకాల సోఫాలు,దివాన్‌కాట్స్ , ప్రముఖ కంపెనీల పరుపులు, బీరువాలు, టీవీ యూనిట్స్, టీపాయ్స్, గృహ అలంకారానికి అవసరమైన అన్నీ ఫర్నీచర్స్ లబిస్తాయని, ఎంపిక చేసిన వాటిపై 50శాతం వరకు రాయితీని కూడా ఇవ్వటం జరుగుతుందన్నారు. ఐదు రోజులపాటూ జరిగే ఈ ఎక్స్‌పోను పురవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మా గ్రామానికి బోరు వేయించిన ఎమ్మెల్యేకి ధన్యవాదాలు - పుట్టా సుబ్రమణ్యంనాయుడు



**బుచ్చి జూన్ 26 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కొట్టాలు గ్రామానికి అడిగిందే తడవుగా మా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జలజీవన్ మిషన్ కింద 6.50 లక్షలతో బోరు మంజూరు చేయించి నందుకు మా గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు చెబుతున్నామని జొన్నవాడ దేవస్ధానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. గురవారం టెంకాయకొట్టి బోరు పనులు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు మా వూరు అడవి ప్రాంతం ఇక్కడ బోరు వేయించడం పట్ల ప్రజలందరు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అలాగే రాజుపాళెం- బుచ్చిరెడ్డిపాళెంకి డబుల్ రోడ్డుకి 48 కోట్ల రూపాయాలతో రోడ్డు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఆయన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.గత ప్రభుత్వం హయాంలో డంపింగ్‌యార్డు సమస్యను కూటమి ప్రభుత్వం రాంగానే మా ఎమ్మెల్యే వెంటనే పరిష్కరించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈకార్యక్రమంలో నాయకులు గిరి, సందానిబాషా, అహ్మద్‌బాషా,గాలి వెంకటరమణయ్య,వెంకయ్య,రమణయ్య తదితరులు పాల్గోన్నారు.

## ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేసిన కలెక్టర్



**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త** ఈవీఎంల గోడౌన్ల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈవీఎంల గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోడౌన్లలోని ఈవీఎంలు, వివి ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. కలక్టర్ వెంట ఆర్డీఓ అనూష, ఏవో నిర్మలానంద బాబా, తహశీల్దార్ షఫి మాలిక్, ఎలక్షన్ సూపరింటెండెంట్ అశోక్ వర్ధన్, టీడీపీ ప్రతినిధులు రసూల్, ఊరందూరు సురేంద్రబాబు, బీజేపీ నుంచి శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి బాల సుధాకర్, వైసీపీ నుంచి మురళీధర్‌రెడ్డి, బీఎస్పీ ప్రతినిధి శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రత్యేక దృష్టి పెటాలని మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సర్వసభ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ రానున్న నేపథ్యంలో ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆరోగ్య సిబ్బంది తగు చొరవ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం చిన్నారులకు సంబంధించి నాణ్యమైన పౌష్టికాహారం ప్రీ స్కూల్ కిట్స్ ఇచ్చిన నేపథ్యంలో తల్లిదండ్రులు తమ చిన్నారులను ఈ కేంద్రాలకు పంపించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్న గ్రామ పంచాయతీలు నిధులను పారిశుధ్యం, ఇతర కార్యక్రమాలకు ఖర్చు పెట్టేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ శ్రీలతలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఆ శాఖ చేస్తున్న పనులపై సమావేశంలో ఎంపీటీసీ సభ్యులకు, సర్పంచ్‌లకు వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## ట్రిబుల్ ఐటీ సాధించిన పీఆర్ఎన్ విద్యార్థినులు



**కోవూరు, జూన్26 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు సంబంధించిన ఇరువురు విద్యార్థినులు ఒంగోలులోని ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీట్లుకు ఎంపికయ్యారు. ఈ పాఠశాలలో 10వ తరగతిలో 579 మార్కు లు సాధించిన దాడి వేద నక్షత్ర.. 572 మార్కులు సాధించిన గోపిరెడ్డి పెంచల దిశలు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు ట్రిబుల్ ఐటీలో సీట్లు పొందడం పట్ల వారిరువురిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందిస్తున్నామన్నారు.

## లబ్దిదారులకు రేషన్ సక్రమంగా అందించాలి



**సైదాపురం, జూన్ 26 ప్రభాతవార్త** మండలంలో ఉన్న లబ్దిదారులకు ఎటువంటి అవకతవకలు జరగకుండా రేషన్ బియ్యం సక్రమంగా అందించాలని తహశీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రేషన్ డీలర్లతో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఇలియాజ్‌తో కలిసి ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 65 సంవత్సరాలు నిండిన వృద్దులకు, వికలాంగులకు గురువారం నుంచి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేయడం జరిగిందని, ఈ పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా మండలంలో రేషన్‌కు సంబంధించి సుమారు 2 వేల మందికి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, వారికి బయోమెట్రిక్ వేయించి పెం డింగ్ లేకుండా చేయాలన్నారు. రేషన్ పంపిణీ విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

## అవెన్యూస్‌లో ఘనంగా సిసిప ఇన్వెస్టిచర్, క్లబ్ ప్రారంబోత్సవం




**నెల్లూరు, జూన్ 26, ప్రభాతవార్త-విద్య :** నగరంలోని స్థానిక బ్రహ్మానందపురంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ లో సిసిప ఇన్వెస్టిచర్ వేడుక, క్లబ్ ప్రారంబోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ప్రముఖ నూరాలజిస్టు డాక్టర్ బిందుమీనన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంబించారు. బిందుమీనన్ మాట్లా డుతు ఇటువంటి కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. విద్యతోపాటూ విలువలు, సమానత్వం, బాధ్యతగలజీవన శైలి అలవాటు అవుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న విద్యాసంస్థల అధినేతలు ఆదర్శప్రాయులన్నారు. తొలుత ఎన్‌సిసి విద్యార్థులు ముఖ్యఅతిధులను మేళతాలాలతో వేడుకగా సభావేదకి వద్దకు తీసుకువచ్చారు. అనంతరం బిందుమీనన్ అభ్యర్థులకు బ్యాడ్జ్‌లను అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్వేత సంధాలు హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, వైస్ కెప్టెన్, ఎన్‌సిసి కెప్టెన్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. బిందుమీనన్‌ని పాఠశాల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పాఠశాల డీన్ కళాకృష్ణ స్వామి, కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విఎస్‌యులో మెగా జాబ్ మేళా

**వెంకటాచలం జూన్ 26 ప్రభావత వార్త :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మెగా జాబ్ మేళా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గం యువత కోసం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్వేపల్లి శాసనసభ్యులు శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరై జాబ్ మేళాను ప్రారంభిస్తారు.ఈ కార్యక్రమంలో 34 కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతిని ధులు పాల్గొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, ఈ సంస్థల ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత మాట్లాడుతూ, జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తమకు తగిన ఉద్యోగ అవకాశాలను పొందడంలో ఇది విశేషంగా ఉపయోగపడుతుంది అని తెలిపారు.